క్లుప్తంగా

ఫుడ్ కార్పొరేషన్ కన్సల్టెటివ్ కమిటీ సభ్యుడిగా గొర్లె



మద్దిలపాలెం: రాష్ట్ర తరఫున భారత ఆహార సంస్థ కన్సల్టెటివ్ కమిటీ సభ్యుడిగా గొర్లె శ్రీనివాసనాయుడు నియామకమయ్యారు. ఈయన రెండేళ్ల పాటు ఈ పదవిలో ఉండనున్నారు. తనకు రెండో దఫా పదవి రావడానికి కృషి చేసిన రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావుకు గొర్లె ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

15వ వార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో విద్యుత్ స్తంభాలు శిథిలం కావడంతో వాటిని మార్చాలని సిబ్బందికి కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఇటీవల సూచించారు. ఈ మేరకు సింహాద్రి పురం కాలనీలో రెండు కొత్త విద్యుత్ స్తంభాలను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు దగ్గరుండి పర్యవేక్షించారు. కొత్త స్తంభాల ఏర్పాటుతో విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం ఉండదని గిరిబాబు తెలిపారు.

19న కళా తపస్వి 93వ జయంతి వేడుకలు

మద్దిలపాలెం: కళా తపస్వి కె.విశ్వనాథ్ 93వ జయంతి వేడుకలను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నామని సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. సీనియర్ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. అనంతరం స్వాతిముత్యం చిత్రాన్ని ప్రదర్శిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94415 71581 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బీచ్‌లో షాపుల కొనసాగింపునకు వినతి

ఎంవీపీ కాలనీ: బీచ్ రోడ్డులో దుకాణాలు కొనసాగింపునకు సహకారం అందించాలని కోరుతూ జీవీఎంసీ వీధి వ్యాపారుల సంఘం ప్రతినిధులు బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్రను కోరారు. ఈ మేరకు లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మార్చిలో జరగనున్న జీ20 సదస్సుల నేపథ్యంలో బీచ్‌రోడ్డులోని వీధి వ్యాపారులను జీవీఎంసీ అధికారులు ఖాళీ చేయించినట్టు తెలిపారు. సదస్సుకు ఇంకా నెల రోజుల వరకు సమయం ఉన్నప్పటికీ వ్యాపారులను ఇప్పుడే ఖాళీ చేయించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ, జీవీఎంసీ అధికారులతో మాట్లాడి మరి కొంతకాలం వ్యాపారాలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భద్రతా పనుల పరిశీలన



తొట్లకొండపై పరిశీలిస్తున్న స్పెషల్ బ్రాంచి ఏసీపీ గోవిందరాజు

కొమ్మాది: నగరంలో జరగనున్న జీ - 20 సదస్సు నేపథ్యంలో పర్యాటక ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను స్పెషల్ బ్రాంచి ఏసీపీ గోవిందరాజు మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు భీమిలి బీచ్ రోడ్డు, మంగమారిపేట వద్ద గల తొట్లకొండపై ఆయన పర్యటించారు. భద్రతా పనులు, కొండపై గల మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట పురావస్తు శాఖ ఏడీ వెంకటరావు, తదితరులు ఉన్నారు.

కారాగారంలో తాజా కూరగాయలు



ముల్లంగి తీసి శుభ్రం చేస్తున్న ఓపెన్ ఎయిర్ ఖైదీ



జైలు ఆవరణలో క్యాబేజీ, టమాటా పంటలు



సుధార్ కేంద్రంలో విక్రయానికి ఉంచిన కూరగాయలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఓపెన్ ఎయిర్ ఖైదీలు పండించే తాజా కూరగాయలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం ముల్లంగి, క్యాబేజీ, టమటా, దోస, ఆనబ, తదితర కూరగాయలను జైలు గేటు ముందు సుమారు నాలుగు ఎకరాలలో పండిస్తున్నారు. వీటి సాగులో ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ ఎరువులు వినియోగిస్తున్నారు. నిత్యం ఇక్కడ కాలానుగుణంగా కూరగాయల పంటల సాగు చేపడుతున్నారు. ఈ కూరగాయలను ఖైదీల భోజనాలకు వినియోగిస్తారు. ఇంకా మిగిలిన కూరగాయలను బయట విక్రయానికి అందుబాటులో ఉంచుతున్నారు. ముల్లంగి, క్యాబేజీ తదితర ఉత్పత్తులను బీఆర్‌టీఎస్ ఆనుకుని జైల్ ప్రధాన ద్వారం వద్ద నిర్వహిస్తున్న సుధార్ కేంద్రంలో విక్రయానికి పెట్టారు. ఈ కేంద్రంలో జైలులో ఖైదీలు తయారు చేసే కేకులు, బిస్కెట్లు, తువ్వాళ్లు, మ్యాటీలు, తదితర వాటిని కూడా విక్రయిస్తున్నారు. రసాయనాలు లేని కూరగాయలు, తాజా, రుచితో కూడినవి కావడంతో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

చోరీ కేసు ఛేదన



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–2లో ఇటీవల జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 3న తన ఇంట్లో దొంగతనం జరిగిందంటూ ఉప్పలపాటి అప్పల రాజేశ్వరి(60) ఎంవీపీ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎంవీపీ క్రైమ్ ఎస్‌ఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. రాజేశ్వరి వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్న ఎదురుపాకల నారాయణప్పడు(35) ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. ఈ మేరకు మంగళవారం వెంకోజిపాలెం కూడలి వద్ద నిందితుడి పోలీసులు అదుపులోకి తీసుకుని, 50.33 గ్రాముల బంగారు గాజులు, 31 గ్రాముల బంగారు గొలుసు, 2 జతల చెవిదిద్దులు, నల్లపూసల గొలుసు.. మొత్తం 9 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను క్రైం డీసీపీ గంధం నాగన్న మంగళవారం మీడియాకు తెలియజేశారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తు రికవరీ చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.

విద్యార్థి అదృశ్యం



రహీం(ఫైల్)

బీచ్ రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ డిగ్రీ విద్యార్థి అదృశ్యమైనట్టు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అరకు వేలీకి చెందిన ఎండీ రహీం సామి(17) ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ బుల్లయ్య కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి ఆయన కనిపించడం లేదు. దీంతో సమాచారం అందుకున్న తల్లిదండ్రులు బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఫలితం లేకపోయింది. రహీం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మంగళవారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

‘పుల్వామా’ అమరవీరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



రక్తదానం చేస్తున్న ఏయూ న్యాయ కళాశాల విద్యార్థులు

బీచ్‌రోడ్డు: పుల్వామా దాడిలో అమరులైన వీర జవానులకు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో విక్టరీ ఎట్ సీ వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్రవాద దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను దేశం కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు రవీంద్ర, డీఎస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులోని అమర వీరుల స్థూపం వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో అమరులైన జవానులకు ఘనంగా నివాళులర్పించారు.

న్యాయ కళాశాల విద్యార్థుల రక్తదానం

ఏయూ క్యాంపస్: పుల్వామా దాడిలో అమరులైన భారతీయ సైనికుల స్మృత్యర్థం ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థులు రక్తదానం శిబిరం నిర్వహించారు. దేశ రక్షణలో భాగంగా విధి నిర్వహణలో ఉండగా ముష్కరుల దాడిలో అమరులైన వీర సైనికులను స్మరిస్తూ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. సేకరించిన ఈ రక్తాన్ని తలసేమియా వ్యాధిగ్రస్తులకు వినియోగిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి తెలిపారు. సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సీత మాణిక్యం, జిల్లా రెడ్‌క్రాస్ సెక్రటరీ పి.రవి కుమార్, యూత్ ఆఫీసర్ సుభాష్, సమన్వయకర్త సంతోష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో అమర వీరులకు శ్రద్ధాంజలి

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం పుల్వామా అటాక్ ను స్మరిస్తూ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించే కార్యక్రమం నిర్వహించారు. వారి సంస్మరణార్థం కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడారు. విద్యార్థు ల్లో దేశభక్తిని పెంపొందిచాలని ఈ కార్యక్రమం ద్వారా అమర వీరులకు నివాళులు అందించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. గీతాంజలి, కళాశాల అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ కె.సుధ, విద్యార్థినులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

వీఎంఎస్‌ను కచ్చితంగా పాటించాలి



మాట్లాడుతున్న క్రైం సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

సీతంపేట: నగరంలో జీ20 సదస్సు జరగనున్న నేపథ్యంలో హోటల్స్, లాడ్జీల యాజమాన్యాలు విజిటర్స్ మానిటరింగ్ సిస్టం (వీఎంఎస్)ను కచ్చితంగా పాటించాలని క్రైం సీఐ టి.ఇమ్మాన్యుయేల్ రాజు అన్నారు. ద్వారకా, ఎంవీపీ స్టేషన్‌ల ఎస్‌ఐలు బి.నిహార్, కె.సురేష్‌ల ఆధ్వర్యంలో స్థానిక రామాటాకీస్ వద్ద ఓ ఫంక్షన్ హాల్లో హోటల్, లాడ్జీల యాజమానులు, మేనేజర్స్‌కు వీఎంఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల జీ20 సదస్సు జరగనున్న నేపథ్యంలో వివిధ రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు నగరంలో హోటల్స్, లాడ్జీలలో బస చేస్తారన్నారు. వారి ఆధార్, ఫోన్ నంబరు, చిరునామా వంటి పూర్తి వివరాలు ఏఎంఎస్‌లో అప్‌లోడ్ చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సత్యనారాయణ, హెచ్‌సీలు జె.ఎం.ఎం. రెడ్డి, ఎస్. షాదాబ్స్, రమేష్ పాల్గొన్నారు.

రుషికొండలో ‘గుట్టు చప్పుడు’ చిత్రీకరణ



నటీనటులకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు మణీంద్రన్

కొమ్మాది: రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద మంగళవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. డాన్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మణీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న గుట్టు చప్పుడు అనే సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. సీనియర్ నటుడు బ్రహ్మాజీ కుమారుడు సంజయ్ రాజ్ (ఓ పిట్ట కథ ఫేమ్), నూతన నటి ఐషా ఖాన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలను మరో నాలుగు రోజులపాటు విశాఖ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తామని నిర్మాత లివింగ్‌స్టన్ తెలిపారు.

రెండు గ్రంథాల ఆవిష్కరణ



లలితాపీఠంలో గ్రంథావిష్కరణ చేస్తున్న వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, సర్వేశ్వర ప్రసాద్

సీతంపేట: విశాఖ సాహితి ఆధ్వర్యంలో లలితాపీఠంలో ఉపాధ్యాయుల గౌరీ శంకరరావు రచించిన రెండు గ్రంథాలను ఆవిష్కరించారు. విశాఖ సాహితి ఉపాధ్యక్షుడు కందాళ కనకమహాలక్ష్మి అధ్యక్షత వహించగా, ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి ముఖ్య అతిథిగా ‘ శ్రీరామ కథా మకరందము, బాలకాండ’ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ప్రసన్న భారతి సంపాదకులు కొండేపూడి సర్వేశ్వర ప్రసాద్ ‘సోహం’ గ్రంథాన్ని ఆవిష్కరించారు. శ్రీరామ కథా మకరందాన్ని జయంతి వెంకట సూర్యనారాయణ మూర్తి సమీక్షించగా, డీవీ సూర్యారావు సోహం గ్రంథాన్ని సమీక్షించారు. గ్రంథ రచయిత గౌరీ శంకరరావు చందో కవిత్వంలో చేసిన కృషిని, కవిత్వంలోని సొబగులను సమీక్షించారు. గ్రంథకర్త శంకరరావు మాట్లాడుతూ విశాఖ సాహితి వేదికగా పెద్దల సమక్షంలో రెండు గ్రంథాలను ఆవిష్కరణ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ సాహితి కార్యదర్శి ఘండికోట విశ్వనాథం, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సీతంపేట: స్థానిక గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, నాగబంధానికి విశేష పూజలు నిర్వహించారు. మాఘమాసం, మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ మంత్రోచ్చరణలతో స్వామికి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామిని పూల దండలతో అలంకరించి హారతులిచ్చారు.

వృద్ధుడికి ఆపన్నహస్తం



రైల్వేస్టేషన్‌లో నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుడిని పరామర్శిస్తున్న మమత

అల్లిపురం: రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుడిని మమత చారిటబుల్ ట్రస్ట్ ఆదుకుంది. ట్రస్ట్ చైర్మన్ మమత తెలిపిన వివరాల ప్రకారం సుమారు 70 సంవత్సరాలు గల బీఎస్ ప్రసాద్ ఒక చైర్‌పై కాలు పురుగులు పట్టి దయనీయ స్థితిలో ఉన్నాడు. ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ఆమె అక్కడికి చేరుకుని అతనిని పరిశీలించగా వృద్ధుని కాలు పురుగులు పట్టి దుర్వాసన రావటంతో ఆయనకు సపర్యలు చేసి అతన్ని పెందుర్తి లయోలా హోమ్‌లో చేర్పించారు. అక్కడ కాలికి డ్రెస్సింగ్ చేసి ఆశ్రయం కల్పించారు.

విద్యా సమాచారమ్

‘నైతిక విలువలు అంతర్భాగం కావాలి’

ఏయూ క్యాంపస్: నైతికత, విలువలు విద్యార్థి దశ నుంచి మనలో భాగం కావాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా యోగా విద్యకు ప్రాముఖ్యత, ప్రాచుర్యం పెరుగుతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మెరుగైన సామర్థ్యాలను పొందే ప్రయత్నం చేయాలన్నారు. కాలాన్ని గౌరవిస్తూ, క్రమ శిక్షణ పాటిస్తూ విద్యాభ్యాసాన్ని పూర్తి చేయాలన్నారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ధ్యానం మానవ జీవితంపై ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంఏ యోగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, గౌరవ సంచాలకుడు ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ తుల సీరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

డీఈవో చంద్రకళ



విద్యార్థుల వర్కు పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

మురళీనగర్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ ఆదేశించారు. మాధవధారలోని జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడంతోపాటు, గణితంలో చతుర్విధ ప్రక్రియలు సాధించాలన్నారు. ఒకటి, రెండో తరగతి విద్యార్థుల పఠణ సామర్థ్యాన్ని ఆమె పరిశీలించి ప్రశంసించారు. నాలుగు, ఐదు తరగతుల్లో విద్యార్థులు సామర్థ్యాల సాధనలో వెనుకబడి ఉన్నారని దీనిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వర్కు బుక్స్, నోట్స్ పరిశీలించిన ఆమె పెండింగ్‌లో ఉన్న వాటిని రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లను రోజూ వినియోగించడంతోపాటు సబ్జెక్టుల వారిగా సాధనా కార్యక్రమాన్ని అమలు చేయాలని చెప్పారు. బైజూస్ కంటెంట్‌ను తక్కువగా ఉపయోగిస్తున్నట్లు ఆమె గమనించారు. ఉపాధ్యాయులు బైజూస్ కంటెంట్ వినియోగం విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థుల నోట్సులను ఎప్పటికప్పుడు దిద్దాలని తప్పులను సరిచేసి సరైన జవాబులను వారితో రాయించాలన్నారు. ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళిక పత్రాలను, డైరీలు, ఇతర ప్రగతి నివేదికలను పరిశీలించారు. హెచ్‌ఎం నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో బాలికల సత్తా



గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, అధ్యాపకులతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులు

మురళీనగర్: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల (గైస్) బాలికలు సత్తా చాటారు. ఇటీవల నెట్టూర్ టెక్నికల్ ఫౌండేషన్ (ఎన్‌టీటీఎఫ్) నిర్వహించిన ఆఫ్ క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఈ కళాశాల నుంచి వెళ్లిన విద్యార్థులు రాత పరీక్ష, మౌఖిక పరీక్షల్లో ప్రతిభను చాటుకున్నారు. వీరిలో 13 మంది బాలికలు నెలకు రూ.18,000ల ప్యాకేజీతో రీసైక్లింగ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కెమికల్ నుంచి ఆరుగురు, పెట్రోకెమికల్ నుంచి ఐదుగురు, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్, ఆయిల్ టెక్నాలజీ విభాగాల నుంచి ఒక్కొరు చొప్పున ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర డిపార్టుమెంటు హెడ్‌లు, అధ్యాపకులు మంగళవారం వీరిని అభినందించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆరిలోవ: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 60 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 5న జాతీయ రహదారిపై జూ పార్కు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలుపాలైన ఆయనను ఆరిలోవ పోలీసులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ఈ నెల 12న రాత్రి మృతి చెందాడు. అప్పటి నుంచి అతని మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఆయన బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు. చికిత్స పొందుతున్న సమయంలో ఆయన పేరు గురుమూర్తి సాహు అని చెప్పినట్టు పోలీసులు తెలిపారు. పూర్తి అడ్రస్ మాత్రం చెప్పలేకపోయాడన్నారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.అనిల్‌కుమార్ తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవం బ్లాక్ హెల్త్ మేళాలో భాగంగా మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నవాల్తేరు పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ కొటక్ స్కూలు, చిన్నవాల్తేరు హైస్కూల్ మీదుగా తిరిగి ఆరోగ్య కేంద్రం వరకు సాగింది. రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, పలువురు వైద్యులు డాక్టర్ జీవన్ రాణి, ఎస్.రమారెడ్డి, డాక్టర్ బద్రినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘం స్థలం పరిరక్షణకు వినతి



ఉన్నతాధికారులకు అందజేసిన ఫిర్యాదు కాపీని చూపిస్తున్న పెదవాల్తేర్ గ్రామ పెద్దలు

ఎంవీపీ కాలనీ: పెదవాల్తేర్ గ్రామ సేవా సంఘానికి చెందిన 472 చదరపు గజాల స్థలాన్ని పరిరక్షించాలని జిల్లా అధికారులు, పోలీసులను గ్రామ పెద్దలు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు, 20వ వార్డు నాయకుడు ముచ్చల సురేష్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్, డీసీపీ సునీల్ గరుడతో పాటు స్థానిక తహసీల్దార్, ఎంవీపీ పోలీసు స్టేషన్ సీఐను కలిసి వినతిపత్రం అందజేశారు. పెదవాల్తేర్‌లో గ్రామ సేవా సంఘం కార్యాలయాన్ని అనుకుని దశాబ్దాలుగా 472 చదరపు గజాల స్థలం ఉంది.

అయితే ఈ స్థలం తమదంటూ మాజీ మునసుబు కుటుంబ సభ్యులు కొందరు ఇటీవల దాన్ని చదును చేసి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించడంతో గ్రామ పెద్దలు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ సంఘానికి చెందిన స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిల్లా రామారావురెడ్డి, దల్లి అప్పలరెడ్డి, పలికిల పైడితల్లిరెడ్డి, పలికిల నీలారెడ్డి, చినిపిల్లి రామిరెడ్డి, మరడ హరినాథ్‌రెడ్డి, చినిపిల్లి లక్ష్మణబాబు, తదితరులు పాల్గొన్నారు.